సాక్షి
కాకినాడ

ఆదివారం । 5 । జనవరి । 2025



వీసీల నియామకానికి కసరత్తు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. త్వరలో పూర్తి స్థాయి వీసీలను నియమించనున్నారు.


8లో



గిత్తందం.. గోచందం..

మలికిపురం మండలంలోని కేశనపల్లిలో గిత్తల అందాలు, ఆవుల పాల పోటీలు రెండో రోజయిన శనివారం కూడా ఉత్సాహంగా సాగాయి.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 12,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,780, మధ్య డెల్టాకు 2,460, పశ్చిమ డెల్టాకు 6,570 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని సన్నిధిలో రద్దీ



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వెలసిన స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయంలో రద్దీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 7 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల టికెట్లు, కేశఖండన, అన్నదాన విరాళాల రూపంలో దేవస్థానానికి రూ.1,28,743 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఐదు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

కొనసాగిన వలంటీర్ల దీక్షలు



వలంటీర్ల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శేషుబాబ్జీ

కాకినాడ సిటీ: ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం ఆధ్వర్యాన వలంటీర్లు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన శనివారం కూడా కొనసాగాయి. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలనే డిమాండు నెరవేర్చుకునేందుకు అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమ స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. వలంటీర్ల భుజంపై తుపాకీ పెట్టి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టార్గెట్ చేసే ఎత్తుగడను టీడీపీ నాయకులు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగా వలంటీర్లందరికీ రూ.10 వేల వేతనం చెల్లించాలని, అందరినీ కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. పండగ రోజుల్లో కూడా వలంటీర్లను వస్తులతో గడిపేలా చేసిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం కావాలని శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, వలంటీర్ల సంఘం జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు ప్రకాష్, వరుణ్‌కుమార్, సతీష్, వరలక్ష్మి, కె.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

వ్రత పురోహితుడి సస్పెన్షన్

అన్నవరం: సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులను దానాలు ఇవ్వాలని ఇబ్బంది పెట్టాడనే ఆరోపణలపై రెండో తరగతి వ్రత పురోహితుడు అల్లంరాజు అచ్యుత్ భగవాన్‌ను సస్పెండ్ చేస్తూ అన్నవరం దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల రెండో తేదీన వ్రతం ఆచరించిన తనను ఆ వ్రత పురోహితుడు కానుకలు అడిగినట్టు ఓ భక్తుడు ఫిర్యాదు చేయడంతో ఈఓ ఈ నిర్ణయం తీసుకున్నారు. భక్తులను ఇబ్బంది పెడితే తీవ్ర చర్యలుంటాయని ఆయన పురోహితులను హెచ్చరించారు.

నైపుణ్యాభివృద్ధిలో ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ, పార్సీ, జైన వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధికి వివిధ రంగాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎం.సునీల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, యూనిఫాం, భోజనం, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నామన్నారు. అర్హులైన వారు 'మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయం, డోర్ నంబర్ 11-1-29, శ్రీ పద్మా టవర్స్, రామారావుపేట, కాకినాడ' చిరునామాలో దరఖాస్తులు అందజేయాలని సునీల్ కుమార్ కోరారు.

దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్న అభ్యర్థినులు



లాంగ్‌జంప్‌లో పాల్గొన్న మహిళా అభ్యర్థి, పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం: కాకినాడలోని పోలీస్‌పరేడ్ మైదానంలో శనివారం కానిస్టేబుల్ ఉద్యోగ నియామక ప్రక్రియ జరిగింది. 320 మంది మహిళా అభ్యర్థినులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. వీరిలో 203 మంది అభ్యర్థినులు తదుపరి పరీక్షలకు అర్హులయ్యారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఈ పరీక్షలను నేరుగా పర్యవేక్షించారు.

ఇచ్చుకోండి.. ఓ కోటి

- ఐదేళ్ల కిందటే అర కోటి ఇచ్చారు..
- ఇప్పుడూ అంతేనా!
- మద్యం వ్యాపారులకు కూటమి నేతల డిమాండ్
- 'కిక్' కావాలంటే అడిగినంతా ఇవ్వాల్సిందేనని పట్టు
- కొలిక్కి రాని బేరసారాలు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'మీరు ఏం చేస్తారో తెలీదు. కచ్చితంగా కోటి రూపాయలు కట్టాల్సిందే. ఎప్పుడో ఐదేళ్ల క్రితమే అర కోటి ఇచ్చారు. ఇప్పుడు కూడా అలానే అంటే ఎలా?' అని కూటమి నేతలు డిమాండ్ చేస్తుంటే..

'అప్పటి మాదిరిగా ఇప్పుడు వ్యాపారాలు సాగడం లేదు. అంతయితే ఇవ్వలేం. అందులో సగం అయితే మాకు ఓకే. ఆ అర కోటి అయినా ఇవ్వాలంటే బాటిల్‌పై రూ.10 పెంచుకుంటాం. పక్కనున్న మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో బాటిల్‌పై అదనంగా రూ.10 పెంచేందుకు ఒప్పందం కుదిరింది కదా! అలానే ఇక్కడ కూడా అనుమతించి అన్నీ చూసుకోవాలి. అలా మీకు సమ్మతమైతే అగ్రిమెంట్ చేసుకుందాం' అని మద్యం వ్యాపారులు బేరసారాలు చేసుకుంటున్నారు.

జిల్లా కేంద్రమైన కాకినాడలో మద్యం వ్యాపారులకు, కూటమి ప్రజాప్రతినిధుల మధ్యవర్తులకు మధ్య పక్షం రోజులుగా ఈ తరహా సంప్రదింపులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. కాకినాడ నగరం, రూరల్ నియోజకవర్గాల్లో కేటాయించిన మద్యం దుకాణదారులను ఒక సిండికేట్‌గా చేసేందుకు గతంలో జరిగిన ప్రయత్నాలు ఫలించ లేదు. చివరకు ఎవరి వ్యాపారం వారు చేసుకుంటున్నారు. అలా ఎవరికి వారు వ్యాపారం వారు చేసుకుంటూపోతే తామేమైపోవాలని నియోజకవర్గ ముఖ్య నేతలకు ఆలోచన వచ్చింది. అంతే.. మద్యం వ్యాపారుల వద్దకు తమ అనుచరులను రాయబారానికి పంపించారు. సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి ముగ్గురు ద్వితీయ శ్రేణి నేతలు.. మద్యం వ్యాపారులతో ఈ చర్చలు జరిపారు. వ్యాపారుల తరఫున ముగ్గురు, ముఖ్య నేతల ప్రధాన అనుచరులు ఈ సంప్రదింపుల్లో పాల్గొన్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారానికి కాకినాడ కుళాయి చెరువు సమీపాన ఉన్న ఒక ప్రముఖ హోటల్ వేదికైంది. ఇరు పక్షాల మధ్య ఇప్పటికే రెండు పర్యాయాలు చర్చలు జరిగాయి. ఇంతవరకూ బేరం మాత్రం కుదరలేదు.

రూ.కోటి ఇస్తామంటేనే చర్చలు

కాకినాడ సిటీలో 36 మద్యం షాపులు, 8 బార్‌లు, కాకినాడ రూరల్‌లో 12 మద్యం దుకాణాలు, 3 బార్‌లు నడుస్తున్నాయి. మొత్తం రెండు నియోజకవర్గాలు కలిపి మొత్తం 48 మద్యం దుకాణాలు, 11 బార్‌లు ఉన్నాయి. వీటిని పర్యవేక్షించే ఎక్సైజ్ శాఖకు ప్రతి నెలా రూ.10 లక్షలు సమీకరించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం అలా ఉండగా.. సిటీ, రూరల్ నియోజకవర్గాల ముఖ్య నేతల విషయంపై ఇరు పక్షాల చర్చల్లో పలు ప్రతిపాదనలు వచ్చాయి. మద్యం షాపులు, బార్లకు లైసెన్స్ పొందిన కాలానికి సంబంధించి సిటీలో ముఖ్య నేతకు రూ.కోటి ఇవ్వాలని పట్టుబట్టినట్టు విశ్వసనీయ సమాచారం. అలాగైతేనే చర్చలకు రావాలని, లేదంటే వద్దని ఆయన ప్రతినిధులు కరాఖండీగా చెప్పారని తెలియవచ్చింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడే తమ నేతకు రూ.50 లక్షలు ఇచ్చారని, దీనికి రెట్టింపు ఇస్తేనే చర్చలు ముందుకు వెళతాయని ఒకింత గట్టిగానే చెప్పారని అంటున్నారు. దీనికి సై అంటేనే భవిష్యత్‌లో ఏ సమస్య వచ్చినా భుజాన వేసుకుంటామని, అలా కాకుంటే మీ ఇష్టమని చెప్పేశారని సమాచారం. రూరల్ నియోజకవర్గ ప్రతిపాదనలను ఇందులో చొప్పించవద్దని, ఇది పూర్తిగా సిటీకి సంబంధించినదని, తమ నేత సీనియర్ అని స్పష్టం చేయడంతో వ్యాపారుల ప్రతినిధులు కంగు తిన్నారు.

అంత ఇచ్చుకోలేం..

ప్రస్తుతం వ్యాపారాలు అంతంత మాత్రంగానే నడుస్తున్నాయని, అందువలన అంత పెద్ద మొత్తంలో ఇవ్వడం తమ వల్ల కాదని వ్యాపారుల ప్రతినిధులు స్పష్టంగా చెప్పారని తెలిసింది. రూ.3 లక్షలు ఆపైన వ్యాపారం జరిగే దుకాణాలు రెండు నియోజకవర్గాల్లో కలిపి 10కి మించి లేవని, మిగిలిన వాటిలో లావాదేవీలు రూ.2 లక్షలకు మించి జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. అటువంటప్పుడు అంతంత భారీ నజరానాలు ఎలా ఇచ్చుకోగలమని వారి ప్రతినిధులు చెప్పడంతో తొలి విడత చర్చలు అర్ధాంతరంగా ముగిశాయి.

అ'ధనం' వసూలుకు అంగీకరించండి

ముఖ్య నేతలకు డిమాండ్ మేరకు ఇవ్వాలంటే ఒక్కో మద్యం బాటిల్‌పై అదనంగా రూ.10 వసూలు చేసుకునే ప్రతిపాదనను వ్యాపారుల ప్రతినిధులు రెండో దఫా భేటీలో తెర మీదకు తీసుకువచ్చారు. మండపేట, కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో అదనంగా వసూలు చేసి, అమ్ముకునేందుకు అనుమతించారని, అదేవిధంగా ఇక్కడ కూడా అనుమతిస్తే రూ.కోటి డిమాండుపై ఆలోచిస్తామని స్పష్టం చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. దీనిపై ఏ విషయమూ తేలకపోవడంతో మరోసారి భేటీ కావాలనే నిర్ణయానికి వచ్చి, చర్చలకు ముగింపు పలికారు. ఏమవుతుందో వేచి చూడాల్సిందే.

డ్రగ్స్‌కు అలవాటు పడితే కేసులు

- చదువుకోవడానికే కళాశాలకు రావాలి
- సామర్లకోట కళాశాల విద్యార్థులకు కలెక్టర్ హెచ్చరిక



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి విచ్చలవిడిగా ఉన్నట్లు ఆరోపణలు రావడం సిగ్గుచేటని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడినట్లు తెలిస్తే వారిపై కేసులు పెట్టడానికి కూడా వెనుకాడేది లేదని హెచ్చరించారు. విద్యార్థులు చదువుకోవడానికి మాత్రమే కళాశాలకు రావాలని చెప్పారు. ఇక నుంచి ప్రతి నెలా ఇంటర్ విద్యార్థుల పరిస్థితిపై సమీక్షిస్తామని, ఏ విద్యార్థిపై ఫిర్యాదు వచ్చినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఇటీవల ఇంటర్ విద్యార్థుల క్వార్టర్లీ పరీక్ష పేపర్లు పరిశీలించామని, అనేక మంది వెనుకబడి ఉన్నారని అన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కూడా ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీలా శ్రీదేవి, కాకినాడ నగరాభివృద్ధి సంస్థ చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవి, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.వుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి కిటకిట



తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ప్రాకార సేవ

అన్నవరం: వేలాదిగా వచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. ఉదయం నుంచీ భక్తులు సత్యదేవుని దర్శనానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు 1,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదా యం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో 4 వేల మంది భోజనం చేశారు. ఈ నెల రెండో తేదీన ప్రారంభించిన డిజిటల్ పేమెంట్స్ కౌంటర్‌కు భక్తుల ఆదరణ రోజురోజుకూ పెరుగుతోంది. గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా భక్తులు శనివారం 175 వ్రతాల టిక్కెట్లు, రెండు కల్యా ణం టికెట్లు కొనుగోలు చేశారు. దీని ద్వారా రూ. 1,80,080 ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. స్వామివారి ప్రత్యేక దర్శనం టికెట్టు రూ. 200 విక్రయాలతో రూ.5,800 ఆదాయం వచ్చిందన్నారు.

ఘనంగా ప్రాకార సేవ

ఆలయ ప్రాంగణంలో సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు తిరుచ్చి వాహనంపై సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అర్చకులు వేంచేయించి, పూజలు చేశారు. అనంతరం కొబ్బరి కాయ కొట్టి ప్రాకార సేవ ప్రారంభించారు. ఆలయ ప్రాకారంలో నాలుగు దిక్కులా కొబ్బరి కాయలు కొట్టి సేవను కొనసాగించారు. తదనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, తిరిగి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథ సేవను ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

మా ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయండి

కాకినాడ క్రైం: ఏళ్లకు ఏళ్లు కాంట్రాక్టు విధానంలో కొనసాగుతూ చాలీచాలని జీతాలు, ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వర్తిస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ తరఫున నాయకులు కాకినాడ అర్బన్, రూరల్ ఎంఎల్ఏలు వనమాడి కొండబాబు, పంతం నానాజీలను కలసి శనివారం వినతిపత్రం సమర్పించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు మామిడి చిన్నారి మాట్లాడుతూ నూరు శాతం గ్రాస్ శాలరీ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు అమలయ్యేలా చూడాలన్నారు. పీహెచ్‌సీల్లో ఐదుగురు స్టాఫ్ నర్సులను నియమించి రాత్రి సమయంలో భద్రతను పటిష్ఠం చేయాలన్నారు. రూ.50 లక్షల బీమా, మెడికల్ లీవ్‌లు అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ నర్సుల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఎంఎల్ఏలను కలసిన వారిలో నర్సులు సత్యసుధ, సుధ, సుమ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్ సేవల్లో మరో మెట్టు

- కాకినాడ జీజీహెచ్‌లో క్యాన్సర్ ఐసీయూ, పాలియేటివ్ కేర్ సేవలు ప్రారంభం
- డాక్టర్ పేర్రాజు దినవహి జ్ఞాపకార్థం బ్యాచ్‌మేట్లు, కుటుంబీకుల వితరణ
- డయాలసిస్ యూనిట్‌లో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు



ఐసీయూ సేవలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో క్యాన్సర్ ఐసీయూతో పాటు పాలియేటివ్ కేర్ (ఉపశమన సంరక్షణ) సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. రంగరాయ వైద్య కళాశాలలో 2001 బ్యాచ్ (థండర్స్)కు చెందిన డాక్టర్ పేర్రాజు దినవహి అత్యుత్తమ వైద్య సేవలతో భారత కీర్తిని అమెరికాలో విస్తరించారు. 2021లో క్యాన్సర్ బారిన పడి గతేడాది ఆగస్టు 24న మరణించిన ఆయన జ్ఞాపకార్థం.. కుటుంబీకులు, బ్యాచ్‌మేట్లు జీజీహెచ్‌లో రూ.9 లక్షలతో ప్రత్యేక క్యాన్సర్ ఐసీయూ ఏర్పాటు చేశారు. 6 పడకలతో పాటు 6 మల్టీ పారా మానిటర్లు, రెండు ఏసీలు, ఎనిమిది ఆక్సిజన్ పాయింట్లు, ఏర్పాటు చేసి క్యాన్సర్ బాధితుల ప్రాణాలకు భరోసా కల్పించారు. ఐసీయూ ఏర్పాటు ప్రక్రియలో 2001 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ తేజోకృష్ణ, డాక్టర్ ఫణి కీలకంగా వ్యవహరించారు. అంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ చొరవ చూపారు.

కీమో థెరపీ తీసుకుంటున్న వారికి వరం

కీమోథెరపీ ఆధారిత క్యాన్సర్ బాధితులకు క్యాన్సర్ ఐసీయూ వరంగా మారనుంది. క్యాన్సర్ చికిత్సలో భాగమైన కీమోథెరపీ రోగి స్థితిని మరింత దుస్థితిలోకి నెడుతుంది. హైఎండ్ కీమోథెరపీ తీసుకుంటున్న బాధితులకు తెల్లరక్తకణాల సంఖ్య క్షీణిస్తుంది. జ్వరం, వాంతులు, విరేచనాలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ స్థితిని వైద్య పరిభాషలో ఫెబ్రాయిల్ న్యూట్రోపీనియా అంటారు. ఈ స్థితిలో క్యాన్సర్ బాధితుడికి ప్రాణాపాయం వాటిల్లే అవకాశం ఉంది. అటువంటి వారికి ఈ ఐసీయూలో అందించే వైద్య సేవ అపర సంజీవనిగా నిలుస్తుంది. త్వరలో ఈ వార్డు మొత్తాన్ని పూర్తి స్థాయి ఐసీయూగా మార్చే ప్రణాళిక సిద్ధం చేసినట్టు హెచ్‌ఓడీ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటివరకూ రోగికి ఐసీయూ అవసరమైతే మరో డిపార్ట్‌మెంట్ ఐసీయూకి తరలించాల్సి వచ్చేది. ఆ డిపార్ట్‌మెంట్‌లో క్యాన్సర్ నిపుణులు ఉండేవారు కాదు. ప్రత్యేక ఐసీయూ ఏర్పాటుతో ఆ కష్టాలకు అడ్డుకట్ట పడింది. రోగి ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా నాలుగైదు రోజుల పాటు ఐసీయూ వైద్య సేవలు అందిస్తారు. జీజీహెచ్ అంకాలజీ ఓపీ భవంతిలో పాలియేటివ్ కేర్ ఓపీ కూడా ఏర్పాటు చేశారు. క్యాన్సర్‌తో ఆరోగ్యపరంగా, మానసికంగా వేదన అనుభవిస్తున్న రోగులకు ఇక్కడ ఉపశమన చికిత్స లభిస్తుంది. ఇందుకు ఓ ప్రత్యేక వైద్యుడుని, రోగులకు ఓ సహాయకురాలిని నియమించారు. కనీసం రోజుకు 5 నుంచి 10 మంది ఈ సేవలు వినియోగించుకునే అవకాశం ఉంది. అలాగే మెడికల్ వార్డులోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న డయాలసిస్ యూనిట్ ద్వారా కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందుతున్నాయి. రక్షిత జలాలతో డయాలసిస్ చేస్తే మరింత ఉత్తమ ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు యూనిట్ పై అంతస్తులో ప్రత్యేకించి డయాలసిస్ కోసం ఓ ఆర్‌వో ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారు. ఈ సేవలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ ఓపీ ఆవరణలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెచ్‌ఓడీలు డాక్టర్ యశోదమ్మ, డాక్టర్ అనురాధ, డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, అంకాలజీ నిపుణులు కర్రా ప్రదీప్, నరసింహులు, రామ్మోహన్, రామ్‌కోశా నుంచి డాక్టర్ ఆనంద్, డాక్టర్ గౌతమ్ ప్రవీణ్, డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఐసీయూ ఏర్పాటుతో క్యాన్సర్ రోగులకు మరింత నాణ్యమైన సేవలు అందనున్నాయని రేడియేషన్ అంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ చెప్పారు. దాతలు మరింతగా సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

సప్త శ్రీనివాస క్షేత్రాలను చూసొద్దాం

తుని: ధనుర్మాసంలో సప్త శ్రీనివాసుల దర్శనానికి తుని నుంచి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు తుని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 7న తుని నుంచి ఉదయం 4 గంటలకు బస్సు బయలు దేరుతుందని ఆయన తెలిపారు. వాడపల్లి, ర్యాలీ, అన్నవరప్పాడు, కొడమంచిలి, అబ్బిరాజుపాలెం, అంతర్వేది, అప్పనపల్లి క్షేత్రాలను ఈ యాత్రలో దర్శించుకోవచ్చునని తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. టికెట్టు ధర రూ.500గా నిర్ణయించామని, వివరాల కోసం 85550 58080, 73829 13016 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

శంఖవరం: మండలంలోని మండపం సెంటర్‌లో గంజాయి రవాణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు అన్నవరం ఎస్సై హరిబాబు తెలిపారు. శనివారం ఎస్సై మాట్లాడుతూ విశాఖ నుంచి రాజమహేంద్రం వైపు బైక్‌పై తొమ్మిది కిలోల గంజాయిని తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి ఇద్దరిని అరెస్టు చేశామని తెలిపారు. సుమారు రూ.45 వేల విలువ గల గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టుకు హాజరుపరిచామన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	15,000 – 15,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వీసీల నియామకానికి కసరత్తు

- ఇప్పటికే సెర్చ్ కమిటీ ఎంపిక పూర్తి
- ఈ నెలలో పూర్తిస్థాయి చర్యలు



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది రోజుల్లోనే రాష్ట్రంలో అన్ని వర్సిటీల వీసీలు రాజీనామా చేయాలన్న మౌఖిక ఆదేశాలతో ఆయా స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జేఎన్‌టీయూకేతో పాటు ఆదికవి నన్నయ వర్సిటీలు ఉన్నాయి. జేఎన్‌టీయూకే వీసీ పదవీ కాలం 6 నెలలు, నన్నయ వీసీ పదవీ కాలం మరో రెండేళ్లు ఉండగానే వారితో రాజీనామా చేయించారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి వీసీల పరిపాలన సాగుతోంది. వీసీల నియామకానికి సెర్చ్ కమిటీలో పాలక మండలి ఒక అభ్యర్థిని నామినీగా నియమిస్తుంది. గత డిసెంబర్‌లో జేఎన్‌టీయూ, నన్నయ వర్సిటీ పాలకమండళ్ల అత్యవసర సమావేశాలు నిర్వహించి నామిని అభ్యర్థి ప్రతిపాదించారు. వీసీల నియామకాల్లో సెర్చ్ కమిటీ ప్రధానం. ఈ కమిటీలో ముగ్గురు విద్యావేత్తలు వర్సిటీల పాలకమండలి ఒక అభ్యర్థిని ఎంపిక చేస్తుంది. యూజీసీ ఒక విద్యావేత్తను, మూడో అభ్యర్థిని ప్రభుత్వం నియమిస్తుంది. ఇప్పటికే వారిని నియమించగా రెండు రోజుల్లోల ప్రభుత్వం తరపున అభ్యర్థి నియమించనున్నట్లు సమాచారం. ఈ ముగ్గరు సెర్చ్ కమిటీలు దరఖాస్తులు పరిశీలించి ముగ్గురి పేర్లు గవర్నర్‌కు పంపగా అందులో ఒకరి పేరును ఆయన ఖరారు చేస్తారు.

పదవులకు పోటీ..

ఈ నెలలో రెండు లేదా మూడో వారంలో వర్సిటీకి కొత్త వీసీల నియామకాలు చేపట్టే అవకాశం ఉందని చర్చ సాగుతోంది. ఉన్నత విద్యామండలి దరఖాస్తులు స్వీకరించడంలో జేఎన్‌టీయూకే నుండి దాదాపు 20 మందికి వరకూ వివిధ వర్సిటీలతో పాటు జేఎన్‌టీయూకే వీసీ పోస్టుకు దరఖాస్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీలకు కలిపి 3వేల దరఖాస్తులు చేరాయి. ఒకే దరఖాస్తు ఎన్ని వర్సిటీలకైనా పంపవచ్చు. ఇలా చాలా మంది ప్రొఫెసర్లు ఐదారు వర్సిటీలకు పంపారు.

ఆశావహుల ప్రయత్నాలు

ప్రస్తుత ఇన్‌చార్జిలతో పాటు గతంలో రిజిస్ట్రార్లు, డైరెక్టర్లుగా పనిచేసిన వారు, ప్రస్తుతం పనిచేస్తున్న వారు దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన వారు కుల, సామాజిక, రాజకీయ పలుకుబడితో పైరవీలు ప్రారంభించారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఉండటంతో జిల్లాలో ఆయనతో నేరుగా సాన్నిహిత్యం ఉన్నవారితో తమ బయోడేటాలు పంపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్సిటీలో కీలక హోదాలో పనిచేసిన వారు వీసీలుగా నియమితులవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జేఎన్‌టీయూకేలో ప్రొఫెసర్ మురళీకృష్ణను జేఎన్‌టీయూకేకి ఇన్‌చార్జి వీసీగా నియమించగా, ఈఈఈ ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావును కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా, ఆదికవి నన్నయ వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా వై.శ్రీనివాసరావును నియమించారు.

రాష్ట్ర పండగగా ప్రభల తీర్థం

ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరుతున్న అర్చకులు, నిర్వాహకులు



జగ్గన్నతోటలో కొలువుదీరిన ఏకాదశ రుద్ర ప్రభలు (ఫైల్)

అంబాజీపేట: మండలంలోని జగ్గన్నతోటలో ఏటా సంక్రాంతికి నిర్వహించే ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని ఏకాదశ రుద్రాలయాల అర్చకులు, గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆయా ఆలయాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబునాయుడుకు లేఖ రాసినట్టు నిర్వాహకులు తెలిపారు. 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభల ఉత్సవాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలని వారు కోరారు. వ్యాఘ్రేశ్వరం (బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వర స్వామి), కె.పెదపూడి (పార్వతీ సమేత మేనకేశ్వర స్వామి), ఇరుసుమండ (బాలాత్రిపుర సుందరి సమేత ఆనందరామేశ్వర స్వామి), వక్కలంక (అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి), నేదునూరు (సర్వమంగళా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి), ముక్కామల (బాలాత్రిపురసుందరీ సమేత రాఘవేశ్వర స్వామి), మొసలపల్లి (బాలాత్రిపురసుందరీ సమేత అనంత భోగేశ్వర స్వామి), పాలగుమ్మి (శ్యామలాంబా సమేత చెన్నమల్లేశ్వర స్వామి), గంగలకుర్రు అగ్రహారం (ఉమాపార్వతీ సమేత వీరేశ్వర స్వామి), గంగలకుర్రు (సర్వమంగళా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వర స్వామి), పుల్లేటికుర్రు (బాలాత్రిపురసుందరీ సమేత అభినవ వ్యాఘ్రేశ్వరుడు) జగ్గన్నతోటలో కనుమ రోజున కొలువుదీరుతారు. ఈ తీర్థానికి జాతీయస్థాయి గుర్తింపు రావడంతో 2020లో ఈ ఉత్సవానికి సంబంధించి ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీ గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులకు లేఖ రాశారు. అలాగే శృంగేరి పీఠాధిపతులు మరొక లేఖను పంపించారు. రెండేళ్ల క్రితం శివకేశవ యూత్ సభ్యులు, ప్రభల నిర్వాహకులు జగన్నతోట ప్రభల తీర్థ విశిష్టతను కేంద్ర, రాష్ట్రాలకు లేఖ ద్వారా వివరించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆంధ్రప్రదేశ్ తరపున ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలలో ప్రభల తీర్థాన్ని కళాజాతను ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఏకాదశ రుద్ర ఆలయాలకు నిధులు మంజూరు చేసి ఈ తీర్థాన్ని రాష్ట్ర పండగగా గుర్తించాలని వారు కోరుతున్నారు.

ఆర్‌ఎస్‌కే విధులకు ఏఈఓలు వద్దు

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వినతి



వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్‌కు టీటీడీ డైరీ అందజేస్తున్న వేణుమాధవరావు

ఆల్మాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్రంలోని రైతు సేవా కేంద్రాల విధుల నుంచి వ్యవసాయ విస్తరణ అధికారులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఏఈఓ సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణు మాధవరావు వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజశేఖర్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం రాజమహేంద్రవరంలో రాజశేఖర్‌ను కలిసి టీటీడీ డైరీ అందజేసిన అనంతరం ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 150 మంది వరకు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్నారని, రైతు సేవా కేంద్రాల్లో ఎవరు సెలవు పెట్టినా ఏఈఓలను నియమిస్తున్నారని పేర్కొన్నారు. క్లస్టర్ స్థాయిలో ఏఈవోలకు మాత్రమే విధులు అప్పగించాలని కోరారు. అలాగే వ్యవసాయ విస్తరణ అధికారులకు ఇన్ సర్వీస్ బీఎస్సీ అగ్రికల్చర్ కోటాను కొనసాగించాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజశేఖర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి పీటర్, ఉమ్మడి జిల్లా ఏఈఓ సంఘ కోశాధికారి ఎం.నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అభయారణ్యంలో ట్రైనీ అధికారుల సందర్శన



కోరింగ అభయారణ్యాన్ని సందర్శించిన ఫారెస్ట్ ట్రైనీ రేంజర్లు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశం కోరింగ అభయారణ్యాన్ని శనివారం ఫారెస్ట్ రేంజ్ ట్రైనీ అధికారులు సందర్శించారు. హైద్రాబాద్ నుంచి 36 మంది వచ్చి అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అభయారణ్యంలోని విశేషాలను, పక్షుల వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ ఎస్‌ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ డిప్యూటీ డీఎఫ్ఓ పి.సాగర్, ఎఫ్‌బీఓలు కె.మహేష్, ఎం.మధు, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

7న డైట్‌లో రంగోత్సవ్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఏడో తేదీ నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి రంగోత్సవ్ 2024–25 పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థలలో ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని ప్రకటనలో తెలిపారు. క్విజ్, డ్రాయింగ్ పోటీలు (స్వాతంత్ర్య సమర యోధుల పాటోలు), హాండ్ రైటింగ్ (తెలుగు/ఇంగ్లీష్), రంగోలి (గ్రూప్ ఈవెంట్–ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు), ఆంధ్రప్రదేశ్, పంజాబ్ జానపద నృత్యాలు, డిజిటల్ కొలేజ్ (యూనిటీ/ఇంటిగ్రిటీ), స్లోగన్ రైటింగ్(ఏక్ భారత్–శ్రేష్ట భారత్) అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. రంగోలి మినహా మిగిలిన పోటీలకు ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 6వ తేదీలోగా డి.సుజాత రత్నం 96183 70735, కె.గంగాధరరావు 94403 39416 ఫోన్ నెంబర్లను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ పోటీలలో ప్రధమ స్థానం పొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

ద్రాక్షారామ ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో జరిగిన స్కూటర్ దగ్ధం నేపథ్యంలో ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్ నమోదు చేసిన ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో భాగంగా అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ శనివారం తాళ్లపొలం వచ్చారు. ఘటనా స్థలాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్, తాళ్లపొలం వీఆర్‌ఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగేంద్ర ప్రసాద్‌కు రైల్వే అత్యున్నత పురస్కారం



రైల్వే ఉన్నతాధికారి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగేంద్రప్రసాద్

మండపేట: పట్టణానికి చెందిన రైల్వే ఇంజినీర్ గండి నాగేంద్ర ప్రసాద్‌కు విశిష్ట సేవా పురస్కారం లభించింది. దక్షిణ మధ్య రైల్వేలో విశిష్ట సేవలకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. సికింద్రాబాద్‌లో నిర్వహించిన 69వ రైల్వే వారోత్సవాల్లో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా నాగేంద్రప్రసాద్ ఈ అవార్డు అందుకున్నట్టు ఆయన సోదరుడు గండి స్వామి ప్రసాద్ శనివారం మీడియాకు తెలిపారు. నాగేంద్ర ప్రసాద్ ప్రస్తుతం విజయవాడలో పని చేస్తున్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

కాకినాడ రూరల్: మండలంలో కోరమండల్ కర్మాగారం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు ఢీకొని వలసపాకలకు చెందిన నమ్మి మణికంఠ (24) మృతి చెందాడు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మణికంఠ ఆయన మేనమామ గురుమూర్తితో మోటార్ సైకిల్‌పై గేదె కోసం కోరమండల్ వైపు వెళ్లారు. గేదె కనిపించడంతో బైక్ నడుపుతున్న గురుమూర్తి పక్కకు వెళ్లగా రోడ్డు పక్కనే నిలిచిన మణికంఠను బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా ఆయన మృతి చెందాడు. గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగేశ్వరరావు శనివారం విలేకర్లకు తెలియజేశారు. మృతుడి తరపున కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కళాశాలకు చెందిన యాజమాన్యంతో మాట్లాడటంతో వారు సానుకూలంగా స్పందించి మణికంఠ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చింది.

పర్యావరణ సమతుల్యతకే పక్షుల గణన

- ఫారెస్ట్ రేంజ్ అధికారి వరప్రసాద్
- నేడు ప్రత్యేక బృందాలతో నీటి పక్షుల లెక్కింపు



పక్షుల గణనపై మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్

తాళ్లరేవు: పర్యావరణంలో నెలకొన్న పరిస్థితులను అంచనా వేసేందుకు పక్షుల గణన ఎంతగానో దోహదపడుతుందని, అందువల్లే ప్రభుత్వం ఏటా ఈ కార్యక్రమం చేపడుతోందని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం కోరంగి బయోడైవర్సిటీ సెంటర్‌లో నిర్వహించిన ఏసియన్ వాటర్ బర్డ్ సెన్సస్ – 2025 వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. మడ అటవీ ప్రాంతంలో సంచరించే వివిధ రకాల పక్షులు, దూర ప్రాంతాల నుంచి వలస వచ్చే పక్షులను లెక్కించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

దీనికి సంబంధించి తమ సిబ్బందితో పాటు ఒక వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, ఒక సైంటిస్ట్, ఒక స్టూడెంట్‌తో నలుగురు సభ్యులతో కూడిన 12 బృందాలను సిద్ధం చేశామన్నారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ప్రత్యేక కెమెరాలతో పలు ప్రాంతాల్లో పక్షుల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ స్టేట్ కో ఆర్డినేటర్ శ్రీరామ్ రెడ్డి పక్షులను ఎలా గుర్తించాలి, గణన ఎలా చేపట్టాలి అన్న అంశాలను ఆయా బృంద సభ్యులకు వివరించారు. అదే విధంగా పక్షుల గణన ప్రాముఖ్యతను సీనియర్ సైంటిస్ట్, బీఎన్‌హెచ్‌ఎస్ ప్రతినిధి ఎస్.శివకుమార్, రీసెర్చ్ సైంటిస్ట్ డి.మహేష్‌బాబు తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా పక్షుల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో 1967 నుంచి పక్షుల గణన ప్రారంభమైందని, అయితే ఆసియా ఖండంలో మాత్రం 1987 నుంచి 27 దేశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్ సత్యనారాయణ, ఎఫ్ఎస్ఓలు, అటవీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విహారాలకు రథం సిద్ధం

- అంతర్వేదిలో ప్రత్యేక పూజలు చేసి షెడ్డు నుంచి తీసుకువచ్చిన అధికారులు
- రథయాత్రలకు, సాఫీగా సాగేందుకు చర్యలు



అంతర్వేదిలో షెడ్డు నుంచి వెలుపలికి తెచ్చిన రథం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయ ప్రాంగణంలోని షెడ్డు నుంచి రథాన్ని వెలుపలికి తీసుకువచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పల్లిపాలెం అగ్నికుల క్షత్రియ సంఘ సభ్యులు, స్థానిక భక్తులు రథాన్ని ప్రాంగణంలోకి తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రానున్న ఉత్సవాలకు రథాన్ని సిద్ధం చేశారు. రథయాత్రలకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు, సాఫీగా సాగేందుకు ఇతర సాంకేతిక పరమైన అంశాలపై సంబంధిత సిబ్బందితో కలిసి పరిశీలిస్తామన్నారు. ఈ మేరకు విశాఖపట్నం నుంచి వచ్చే సాంకేతిక బృందం హైడ్రాలిక్ బ్రేక్ సిస్టం, రథాన్ని అక్కడికక్కడే దిశ తిప్పే సెంటర్ ఆఫ్ గ్రావెటీ జాకీ సిస్టంను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిత్తందం.. గోచందం

- రెండో రోజూ ఉత్సాహంగా గిత్తలు, ఆవుల పోటీలు
- ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు



గిత్తల అందాలను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

మలికిపురం: మండలంలోని కేశనపల్లి గ్రామంలో గిత్తల అందాలు, ఆవుల పాల పోటీలు శనివారం రెండో రోజూ ఉత్సాహంగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి రైతులతో వచ్చిన గిత్తల అందాలను న్యాయ నిర్ణేతలు వీక్షించారు. అలాగే శనివారం ఉదయం, రాత్రి కూడా ఆవుల పాల ఉత్పాదన పోటీలు నిర్వహించారు. ప్రదర్శనలకు వచ్చిన ఆవులు, గిత్తలకు నిర్వాహకులు మేత సమకూర్చారు. పశు వైద్య నిపుణులను అందుబాటులో ఉంచి ఆవులకు, గిత్తలకు మంచు నుంచి రక్షణగా టెంట్‌లను ఏర్పాటు చేశారు. ఆదివారం ముగింపు, బహుమతుల ప్రదానం చేయనున్నారు.

సోషల్ మెసేజ్ సినిమా 'గేమ్ ఛేంజర్'

గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



గేమ్ ఛేంజర్ ఈవెంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హీరో రామ్‌చరణ్, యూనిట్ సభ్యులు

సాక్షి, రాజమహేంద్రవరం: రామ్‌చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' సోషల్ మెసేజ్ ఉన్న సినిమా అని, సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సినీ నటుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. రాంచరణ్ కథనాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'గేమ్ ఛేంజర్'. కియారా అద్వానీ కథానాయిక. దిల్ రాజు నిర్మాత, సంక్రాంతి కానుకగా జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతున్న సందర్భంగా రాజమండ్రి రూరల్ వేమగిరి వద్ద శనివారం మూవీ గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. కార్యక్రమానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సినిమా ట్రైలర్ అద్భుతంగా ఉందన్నారు. సినిమా చిత్రీకరణకు బడ్జెట్ పెరుగుతున్న నేపథ్యంలో టికెట్ రేట్లు పెంచుతున్నామన్నారు. తాను ఈ స్థాయిలో ఉన్నానంటే చిరంజీవి చలవేనన్నారు. రామ్‌చరణ్ తమ్ముడు లాంటివాడని, ఎంత ఎదిగినా ఒదిగుండే మనిషన్నారు. భవిష్యత్తులో ఉత్తమ నటుడు అవార్డు అందుకోవాలని కోరుకుంటున్నట్లు ఆకాంక్షించారు. కాగా ఈ ప్రైవేటు కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ సహా అధికారులు హాజరు కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.